క్లుప్తంగా

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వి. రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం పూజలు, అభిషేకాలు విశేషంగా జరిగాయి. తెల్లవారు జామున 5గంటల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. స్వామి సన్నిధి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరలు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

నేడు మొక్కలు నాటే కార్యక్రమం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు పార్కులో మొక్కలు నాటుతామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా 300 మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు. బ్యూటిఫికేషన్‌కు ఉపయోగపడే ఎడ్జ్ ప్లాంట్స్, ఫ్లవర్ ప్లాంట్స్, ఆక్సిజన్ మొక్కలు నాటుతామన్నారు. కార్యక్రమంలో వాకర్స్‌తోపాటు క్లబ్ సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

12 నుంచి 'మిషన్ లైఫ్'

అగనంపూడి: ఏపీఎన్‌జీసీ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ప్రతి పాఠశాలలో మిషన్ లైఫ్ కార్యక్రమం నిర్వహించాలని ఏపీఎన్‌జీసీ అనకాపల్లి జిల్లా కో–ఆర్డినేటర్ శిష్టు ఖగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర సమగ్ర శిక్షా ఎస్పీడీ ఆదేశాలు, అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ సూచనల మేరకు పాఠశాలల్లో ఎకో క్లబ్‌ల ద్వారా నిర్వహించాలని కోరారు.

ఇదీ షెడ్యూల్

- 12న నీటిని ఆదా చేయడం, పాఠశాలల్లోని పైప్‌లైన్ల లీకేజీలు అరికట్టడం, నీటి స్వచ్ఛత పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.
- 13న శక్తిని ఆదా చేయడం, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ పొదుపు, ఎనర్జీ టీమ్‌లు, క్లబ్‌లు ఏర్పాటు చేయడం, పోస్టర్లు, బ్యానర్లు తయారు చేయాలన్నారు.
- 14న వ్యర్థాలను తగ్గించడం, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో శుభ్రత, వ్యర్థాలను వేరు చేయడం విద్యార్థులకు అలవాటు చేయాలని తెలిపారు.
- 15వ తేదీన భూమిపై ఈ వ్యర్థాల ప్రభావంపై పిల్లలతో చర్చించాలి.
- 18వ తేదీన స్థిరమైన ఆహార వ్యవస్థ, కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేయడం, మొక్కల పెరుగుదల, పర్యావరణ ప్రయోజనాలపై చర్చించడం చేయాలని తెలియజేశారు.
- 19వ తేదీన ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, నేచర్ వాక్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకొని ఉపాధ్యాయులు, విద్యార్థులను భాగస్వాములను చేయాలని తెలిపారు.

విశాఖ 'దక్షిణ' వంశీకే

64,594 ఓట్ల భారీ మెజారిటీ



రిటర్నింగ్ అధికారి సీతారామ్మూర్తి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న వంశీకృష్ణ శ్రీనివాస్

దాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి చెన్నుబోయిన వంశీకృష్ణ శ్రీనివాస్‌కు 97,868 ఓట్లు వచ్చాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌కు 33,274 ఓట్లు వచ్చాయి. వంశీకృష్ణ శ్రీనివాస్ 64,594 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 16 మంది పోటీ చేశారు. నియోజకవర్గంలో 2,16,770 మంది ఓటర్లు ఉండగా 1,37,474 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీటిలో వంశీకృష్ణ శ్రీనివాస్‌కు 97,868 ఓట్లు పోలవ్వగా, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌కు కేవలం 33,274 మాత్రమే పోలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీలో ఉన్న వాసుపల్లి సంతోష్‌కుమార్‌కు 3,940 ఓట్లు వచ్చాయి. వాసుపల్లి గణేష్‌కుమార్‌పై 64,594 ఓట్ల తేడాతో వంశీకృష్ణ శ్రీనివాస్ విజయం సాధించారు. పోస్టల్/సర్వీస్ ఓట్లతో పాటు ప్రతి రౌండ్ లోనూ వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధిక్యత సాధించారు.

ప్రధాన పార్టీల అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

రౌండ్లు	వైఎస్సార్ సీపీ	జనసేన	ఆధిక్యం
1	1722	4241	2519
2	2854	4555	1701
3	2039	6074	4035
4	2207	6454	4247
5	2140	6164	4024
6	2037	5531	3494
7	1733	7166	5433
8	1533	5856	4323
9	1970	6080	4110
10	2013	5907	3894
11	1741	5060	3319
12	1944	5634	3690
13	2042	6629	4587
14	1776	5746	3970
15	1653	6066	4413
16	1626	5424	3798
17	1706	3999	2293



ఏయూ ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో దక్షిణ నియోజకవర్గం ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది

జనతా బజార్‌కు మోక్షమెప్పుడో!



75 ఫీట్‌రోడ్డులో ఉన్న జీవీఎంసీ జనతా బజార్

జగదాంబ: 75 ఫీట్‌రోడ్డులో ఉన్న జీవీఎంసీ జనతా బజార్ తొలగింపునకు మోక్షమెప్పుడని వ్యాపారులు, స్థానికులు ఎదురు చూస్తున్నారు. 35వ వార్డులో 1972లో ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం నిర్మించారు. అదే సమయంలో 72 దుకాణాల సముదాయాన్ని కూడా అప్పటి మున్సిపల్ కార్పొరేషన్ నిర్మించి వ్యాపారులకు అందజేసింది. అయితే కాలక్రమేణా జనతా బజార్ శిథిలావస్థకు చేరుకుంది. ప్రతి సంవత్సరం కురుస్తున్న వర్షాల కారణంగా ఇక్కడి దుకాణాల్లోని శ్లాబ్‌లు, పిల్లర్లు పెచ్చులూడిపోయి ప్రమాదకరంగా తయారయ్యాయి. దీంతో అందులో వ్యాపారాలు చేసుకునే వారంతా ఎప్పుడు కూలిపోతాయోనని భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో గత ఏడాది కోర్టు నుంచి దుకాణ సముదాయాన్ని తొలగించాలని ఆదేశాలు వచ్చాయి. అయినప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో రూ.18 లక్షలతో బజార్ తొలగింపునకు అధికారులు తయారు చేసిన నివేదికను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మకు సమర్పించినట్లు తెలుస్తోంది. కమిషనర్ చర్యలు తీసుకుని ఆదేశాలు జారీ చేస్తే దుకాణాలు కూలగొట్టడానికి అధికారులు ఎదురు చూస్తున్నట్లు చెబుతున్నారు.

దుర్గమ్మ వారికి పసుపు కుంకుమ సమర్పణ



ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మవారు

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి గ్రామ దేవత శ్రీ దుర్గమ్మ అమ్మవారి పండగ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం దొండపర్తి గ్రామస్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి అల్లూరి సత్యనారాయణరెడ్డి, కారాల మహేష్ మాట్లాడుతూ 10వ తేదీన పుట్టబంగారం తీసుకురావటంతో పాటు అమ్మవారిని గ్రామంలోకి తీసుకొచ్చి 9 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు చేయనున్నట్లు తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు వేడుకలను పర్యవేక్షించారు.

చకచకా వాకర్స్ పార్క్ పనులు



మురళీనగర్ వాకర్స్ పార్క్



ఫినిషింగ్ పనులు చేస్తున్న కార్మికులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్క్‌లో చేపట్టిన ప్రాంగణం విస్తరణ పనులు పూర్తయ్యాయి. ఇక్కడి వేదిక ఎదురుగా ఉన్న ప్రాంగణం విస్తరణకు క్లబ్ ఆధ్వర్యంలో నెల రోజులుగా జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న 1,600 చదరపు అడుగుల ప్రాంగణాన్ని ఎక్కువ మంది కూర్చుని విశ్రాంతి తీసుకునే విధంగా, సమావేశాల్లో ఎక్కువ మంది పాల్గొనేలా విస్తరించాలని భావించారు. మరో 800 చదరపు అడుగుల స్థలాన్ని ప్రాంగణంగా రూపొందించి మొత్తం 2,400 చదరపు అడుగులుగా తీర్చిదిద్దారు. ఈ మేరకు మంగళవారం ఫినిషింగ్ పనులు చేశారు. బెంచీలు ఉన్న స్థలంలో కూడా టైల్స్ ఏర్పాటు చేస్తామని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి చెప్పారు. దీంతోపాటు దాత సహకారంతో ప్రవేశ ద్వారం నుంచి పాత్‌వే అభివృద్ధికి త్వరలో పనులు చేపడతామన్నారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠం పజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకుడు పవన్‌కుమారాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా దుర్గమాంబ మారువారం పండగ



దుర్గమాంబకు పూజలు చేస్తున్న అర్చకులు

కంచరపాలెం: గొల్లకంచరపాలెం వాసుల ఆరాధ్య దైవం దుర్గమాంబ అమ్మవారి మారువారం జాతర శ్రీరామసేవా సమాజం(యాదవ్) ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దుర్గానగర్‌లోని ఆలయంలో ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ నేతృత్వంలో గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు మజ్జిగ, ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నేల డ్యాన్స్‌లు నిర్వహించారు. తోటవీధిలో పుట్టబంగారం నుంచి అమ్మవారి ప్రధాన దేవాలయం వరకు అమ్మవారి ప్రధాన ఘటాన్ని జాతర వేడుకల్లో ఊరేగించారు. గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బీజేపీకి రానున్నది గడ్డుకాలమే..



శిబిరంలో పాల్గొన్న నాయకులు

అగనంపూడి: దేశంలో బీజేపీకి రానున్నది గడ్డు కాలమే అని, వారి పాలనకు రానున్న రోజుల్లో నూకలు చెల్లినట్టే అని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎస్.రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 1209వ రోజు, మంగళవారం వారు మాట్లాడారు. తిరుగులేని అధికారంతో విర్రవీగిన బీజేపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి లాభాల బాటలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి, నాశనం చేయాలని చూశారన్నారు. వారికి దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఇప్పటికైనా బీజేపీ, ఎన్‌డీఏ పక్షాలు కళ్లు తెరిచి స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోకపోతే పుట్టగతులు ఉండవన్నారు. కార్యక్రమంలో నాయకులు వి.శ్రీనివాసరావు, ఎంఎంఎస్ఎం, ఎస్టీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

సౌకర్యానికి.. అసౌకర్యం

- ఒకేసారి మరమ్మతులతో నిలిచిపోయిన లావాదేవీలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



విద్యుత్ స్తంభించటంతో పనులు నిలిచిపోయి ఖాళీగా ఉన్న సౌకర్యం సెంటర్



జీవీఎంసీ జోన్-4 కార్యాలయంలో జరుగుతున్న మరమ్మతులు

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 సౌకర్యం సెంటర్‌కు అసౌకర్యం ఏర్పడింది. ఇటీవల జోన్ కార్యాలయం మరమ్మతులకు నిధులు కేటాయించి టెండర్ పిలవటంతో కాంట్రాక్టర్లు కార్యాలయంలో పనులు ప్రారంభించారు. రంగులు, సీలింగులు, విద్యుత్ వంటి అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు. అయితే పనులన్నీ ఒకేసారి ప్రారంభించడంతో సౌకర్యం సెంటర్‌లో లావాదేవీలు నిలిచిపోయాయి. వాస్తవంగా అయితే కాంట్రాక్టర్లు ఏ పనినైనా రోజువారీ లావాదేవీలకు ఇబ్బంది లేకుండా చేపట్టాల్సి ఉంది. అయితే అన్ని పనులు ఒకేసారి మొదలుపెట్టడంతో జోనల్ స్థాయిలో జెడ్సీ నుంచి రెవెన్యూ, టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి పనులు ముందుకు సాగడంలేదు. ఇప్పటికి వారం రోజులుగా ఇదే తంతు జరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటన్నిటిని పక్కన పెడితే జీవీఎంసీకి ఆదాయం వచ్చే సౌకర్యం సెంటర్‌లో కూడా విద్యుత్ పనుల కోసం కరెంట్ తీగలు కట్ చేయడంతో జీవీఎంసీకి కూడా నష్టం వాటిల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే సౌకర్యం సెంటర్ పనులు ముందుగా చేసి ప్రజల అందుబాటులోకి తీసుకురావాలని జోన్–4 ప్రజలు కోరుతున్నారు.

పోలీస్ దిగ్బంధంలో ఏయూ పరిసరాలు



మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరువలో పోలీసుల పికెట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మంగళవారం పోలీసు దిగ్బంధంలోకి వెళ్లిపోయింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంలను భద్రపరచడం, ఓట్ల లెక్కింపు ప్రక్రియ వంటివి ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వేదికగా సాగాయి. మంగళవారం నిర్వహించిన ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మూడో పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి మద్దిలపాలేనికి వెళ్లే రహదారిని పూర్తిగా పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మద్దిలపాలెం కూడలి వద్ద, మూడో పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. ఉదయం ఓట్ల లెక్కింపు కేంద్రాలకు వచ్చిన పోలింగ్ ఏజెంట్లను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే లోపలికి పంపారు. వారికి బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేశారు. ఆ తరువాతనే ఏజెంట్లను లోపలికి పంపారు.

- పోటీ చేసిన అభ్యర్థులను సైతం పోలీసులు తనిఖీలు చేశారు. అభ్యర్థి, కారు డ్రైవర్, ఒక సెక్యూరిటీని మాత్రమే లోపలికి అనుమతించారు. మంత్రి గుడివాడ, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణలను సైతం ఇదే విధంగా తనిఖీ చేసి పంపారు. నగరంలో ప్రతి వార్డులో ప్రధాన కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాలలో పోలీసులు పికెటింగ్ నిర్వహించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, ముందు జాగ్రత్తగా బందోబస్తు నిర్వహించారు.

పార్కింగ్‌కు నో ప్రాబ్లం

- జగదాంబ సెంటర్‌లో వాహనాల నిలిపివేత ఇక సులభతరం
- రెండు గంటల పార్కింగ్‌కు రూ.35.. ఆపై ప్రతి గంటకు రూ.10
- మల్టీలెవల్ కార్ పార్కింగ్‌తో ట్రాఫిక్‌కు చెక్
- సరాసరి రోజుకి 30 నుంచి 40 కార్ల పార్కింగ్



జగదాంబ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన మల్టీ లెవల్ కార్ పార్కింగ్

దాబాగార్డెన్స్: దేశంలోనే తొలి మెకనైజ్డ్ ఆటోమేటిక్ కార్ పార్కింగ్ నగర ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ఒకప్పుడు జగదాంబ జంక్షన్‌లో కారు పార్క్ చేయాలంటే అవస్థలు పడేవారు. కిలోమీటర్ దూరంలో పార్కింగ్ చేసి నడుచుకుంటూ జంక్షన్‌కు చేరుకునేవారు. అంతేకాదు.. జంక్షన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా కారు పార్క్ చేస్తే పోలీసులు అగమేఘాలపై వచ్చేవారు. టోయింగ్ వాహనం ద్వారా నగర శివారుకో.. లేదా స్టేషన్ పరిధిలో విశాలమైన ప్రదేశం వద్దకు తీసుకెళ్లి వదిలేసేవారు. అక్కడితో ఆగిపోకుండా జంక్షన్‌లో కారు పార్క్ చేసినందుకు జరిమానాలు కూడా విధించేవారు. ఇప్పుడు ఆ భయం లేదు. జగదాంబ జంక్షన్‌కు హాయిగా వచ్చి అక్కడ (ఎంఎల్‌పీ వద్ద) ఏర్పాటు చేసిన మల్టీ లెవల్ కారు పార్కింగ్‌లో వాహనాన్ని దర్జాగా పార్కింగ్ చేసి.. పనులు పూర్తి చేసుకుని.. హాయిగా ఇంటికి వెళ్లొచ్చు.

100 కార్లు పార్కింగ్ చేసుకోవచ్చు..

జగదాంబ జంక్షన్‌కు కూతవేటు దూరంలో దేశంలోనే తొలి మెకనైజ్డ్ ఆటోమేటిక్ కార్ పార్కింగ్ గత ఏడాది ప్రారంభమైన సంగతి తెలిసిందే. 367 చదరపు మీటర్ల విస్తీర్ణంలో జగదాంబ జంక్షన్‌లో నిర్మించిన ఎంఎల్‌సీపీలో 100 కార్లు పార్కింగ్ చేసుకోవచ్చు. రూ.11.45 కోట్లతో మొత్తం ఆరు లెవెల్స్‌లో పార్కింగ్ చేసుకునేలా స్ట్రక్చర్ నిర్మాణం జరిగింది. ఇందులో పార్కింగ్ చేసుకునేందుకు జీవీఎంసీ నామమాత్రపు ధర నిర్ణయించింది. రెండు గంటల సేపు పార్కింగ్ చేస్తే రూ.35, రెండు గంటలు దాటిన తర్వాత ప్రతి గంటకు అదనంగా రూ.10 వసూలు చేస్తున్నారు. ఫలితంగా కార్ల యజమానులు అక్కడ పార్కింగ్ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. 100 కార్లు పార్కింగ్ చేసే కెపాసిటీ ఇక్కడ ఉంది. అయితే ప్రస్తుతం రోజుకి సరాసరిగా 30 నుంచి 40 కార్లు పార్కింగ్ అవుతున్నాయి. ఆదివారం, పండగ రోజుల్లో మాత్రం ఆ సంఖ్య 60 నుంచి 70కి చేరుతుంది.

ట్రాఫిక్ సమస్యకు చెక్..

మల్టీ లెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటైన నాటి నుంచి జగదాంబ జంక్షన్ పరిసర ప్రాంతాల్లో కొంతమేర ట్రాఫిక్‌కు చెక్ పెట్టినట్టయింది. నగరం నుంచే కాక జిల్లా.. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వ్యాపారం.. ఆస్పత్రి.. వ్యక్తిగత పనులపై వచ్చే వారు గతంలో పార్కింగ్ చేయాలంటే అనేక ఇబ్బందులు పడేవారు. ఎంఎల్‌సీపీ ప్రారంభమైన తర్వాత కారు పార్కింగ్ సులువైంది. నామమాత్రపు రుసుం వసూలు చేస్తుండడంతో కార్ల యజమానులు అక్కడే పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా పరిసర ప్రాంతాల్లో నిత్యం రద్దీగా ఉండే జంక్షన్‌ల వద్ద ట్రాఫిక్‌కు కొంతమేర చెక్ పెట్టినట్టయింది.

అంబులెన్స్‌లకు లైన్ క్లియర్..

కింగ్‌జార్జి ఆస్పత్రితో పాటు పలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాలంటే అంబులెన్స్ డ్రైవర్లు జగదాంబ జంక్షన్ వద్ద ఇబ్బందులు పడేవారు. కుయ్‌కుయ్ మంటూ 108 వాహనాలు హారన్లు మోగిస్తున్నా.. ట్రాఫిక్ రద్దీ కారణంగా అత్యవసర అంబులెన్స్‌లు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయేవి. అలాగే కార్లను కూడా జగదాంబ పరిసర ప్రాంతాల్లోని గల్లీలో పార్కింగ్ చేసేవారు. ఫలితంగా అంబులెన్స్‌లు ఆస్పత్రులకు వెళ్లేటప్పుడు అవస్థలు పడేవి. ప్రస్తుతం ఆ పరిస్థితికి చెక్ పడినట్టయింది.

నామమాత్రపు రుసుంతోనే..

జగదాంబ జంక్షన్‌కు సమీపంలో ఉండే చాలా మంది వ్యాపారులు మల్టీ లెవల్ కార్ పార్కింగ్‌ను సద్వినియోగం చేసుకుంటున్నారు. వీరు మంత్లీ, రెగ్యులర్‌గా పార్కింగ్ ఉపయోగించుకుంటున్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు పార్కింగ్ సదుపాయం ఉండడంతో వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో వరప్రసాద్ తదితరులు

మురళీనగర్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు సహకరించాలని వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ కోరారు. స్పోర్ట్స్ పార్కు ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాల ముగింపు సందర్భంగా మంగళవారం విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను పిల్లలపై రుద్దకుండా వారికి ఇష్టాలను, ఆశయాలను గౌరవించాలని సూచించారు. గత నెల రోజులుగా పార్కులో చదరంగం, యోగా, చిత్రలేఖనం, నృత్యం, భగవద్గీత తదితర అంశాల్లో శిక్షణ పొంది విజేతలైన విద్యార్థులు, పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలు, బహుమతులు ఆయన అందించారు. శిక్షకులు సనపల ఉమాపతి, ఎం.జయ, ఎం.లక్ష్మి, డి.ప్రశాంతి, డి.షీల, హేమలను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పార్కు నిర్వహణ కమిటీ కార్యదర్శి పి.వి.సూర్యనారాయణరాజు, ఉపాధ్యక్షులు పల్లా చంద్రమౌళి, కోశాధికారి మళ్ల రామకృష్ణ, ఉప కోశాధికారి కె.కె.సురేష్, కార్యవర్గ సభ్యులు పొందూరు సూర్యనారాయణ, రోణంకి నాగేశ్వరరావు, లంకా వెంకట సుధాకర్, వల్లభనేని వీర రాఘవయ్య పాల్గొన్నారు.